## క్లుప్తంగా

### ఘనంగా ఎమ్మెల్సీ ముందస్తు జన్మదిన వేడుకలు



యువకులతో కలిసి కేక్ కటింగ్ చేస్తున్న పర్వతరెడ్డి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) :** వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను నగర పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ యువ నాయకులు పర్వతరెడ్డి లోకేష్‌రెడ్డి, యనమల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువత బైక్ ర్యాలీ చేసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం యువకులతో కలిసి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉమర్, అబ్దుల్, పెంచలబాబు, శేఖర్, జయవర్ధన్, భవదీశ్ పాల్గొన్నారు.

### వేడుకగా 'శతమానం భవతి'



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'శతమానం భవతి' కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ నెలలో జన్మించిన అసోసియేషన్ సభ్యులను సన్మానించి, ఆశీర్వచన పత్రాన్ని అందజేశారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఏడు నెలలుగా క్రమం తప్పకుండా శతమానం భవతిని వేడుకగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి శ్రీనివాసులునాయుడు, గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, నసీర్‌అహ్మద్, బి.సదానందరెడ్డి, వి.ఆదినారాయణరెడ్డి, ఎం.సురేష్, వై.శ్రీనివాసులురెడ్డి, కె.వెంకటరమణ, ఎం.రాజేంద్రప్రసాద్, పీవీ మోహన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్లునాయుడు, మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికురాలికి సాయం



**నెల్లూరు(అర్బన్):** నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పసల రమణమ్మ కుటుంబానికి తోటి కార్మికులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆమె భర్త రంగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భీమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రమణమ్మ నివాసానికి ఆదివారం వెళ్లి సాయాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుమతి, యాలమ్మ, సుబ్బమ్మ, పోలమ్మ, శైలజ, స్వరూప, విజయమ్మ పాల్గొన్నారు.

### నిస్సహాయ వర్గాల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు

**నెల్లూరు(బృందావనం):** సమాజంలో అనేక సమస్యలతో సతమతమవుతున్న నిస్సహాయ వర్గాల సంక్షేమం కోసం నెల్లూరు జిల్లా సేవా సంస్థల సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎస్) తన వంతు కృషి చేస్తోందని సమాఖ్య నిర్వాహకులు తెలిపారు. చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు ఆదిత్యనగర్‌లోని ఐఎంఎం ఆఫీస్‌లో ఆదివారం వివిధ సేవా సంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిబయట పిల్లలు, బాలకార్మికులు, నిరాదరణకు గురైన వృద్ధులు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితులు, ఒంటరి మహిళలు, వ్యవసాయ కార్మికులు తదితర నిస్సహాయ వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయనుందన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలను ఒకేతాటిపై తెచ్చేందుకు 'నెల్లూరు జిల్లా సేవా సంస్థల సమాఖ్య'ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమాఖ్య సమావేశం ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు ఏసీ స్టేడియం దగ్గర ఉన్న అంబేడ్కర్ భవనంలో జరుగనుందన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు హాజరై జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సమాఖ్య కన్వీనర్స్ ఈ.శ్రీనివాసరావు, బాలచెన్నయ్య, కేఎస్ఎస్ బాబా, చిట్టిబాబు, విజయబాబు, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిలువెత్తు నిర్లక్ష్యం

నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలోని రాజీవ్ గృహకల్ప నివాసాలు పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన గృహాల్లో పేదలు నివాసం ఉంటున్నారు. అయితే అప్పటి నుంచి ఎలాంటి నిర్వహణ చేయకపోవడంతో చాలా చోట్ల భవనాలు పెచ్చులూడిపోయింది. బిల్డింగ్ పైభాగంలో, ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు మొలిచి చెట్లుగా మారుతున్నాయి. రానున్న వర్షాకాలం నేపథ్యంలో అధికారులు తగిన పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కిటికీల వెంబడి ఏపుగా పెరుగుతున్న చెట్లు



పెచ్చులూడుతూ..



కూలేందుకు సిద్ధంగా..



బిల్డింగ్ పైభాగంలో పెరుగుతున్న మొక్కలు

# మర్యాదపూర్వకంగా..



మాజీ మంత్రి అనిల్‌ను సత్కరిస్తున్న నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) :** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌ను పార్టీ నగరాధ్యక్షుడిగా నియమితులైన కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, పార్టీ నేతలు మల్లికార్జునరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భానుప్రకాష్‌రెడ్డి, దాసు, హలీం, మురళీయాదవ్, ఖాదర్‌బాషా, ఖలీల్, ఘనీ, సునీల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

• **నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** మాజీ మంత్రి అనిల్‌కుమార్‌ను నెల్లూరులోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, సురేష్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌ను సత్కరించి పూలమొక్కను అందజేశారు.



అనిల్‌ను సత్కరిస్తున్న మొయిళ్ల గౌరి

# హోరాహోరీగా క్రికెట్ టోర్నీ



విజేతలతో అతిథులు

**నెల్లూరు(బారకాసు):** నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లాస్థాయి టీ–20 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం హోరాహోరీగా జరిగింది. ఉత్కంఠ పోరులో కావలి జట్టుపై గూడూరు జట్టు విజయం సాధించింది. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేయర్ స్రవంతి సహకారంతో జరిగిన టోర్నీలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.30 వేలు, రూ.15 వేలు, రూ.7,500 నగదుతో పాటు క్రికెట్ కప్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలతో గిరిపుత్ర ఫౌండేషన్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చేవూరి అరుణ, ఇరిగేషన్ డీఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు నెల్లూరుకు షర్మిల రాక

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** నగరంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రానున్నారని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, జిల్లా, మండలస్థాయి, యువజన విభాగం, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# పౌష్టికాహార దాతలకు సన్మానం



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మే నెలలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాల్లో క్రీడాకారులకు పౌష్టికాహారం అందించిన దాతలకు ఆదివారం అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి హాజరై, మాట్లాడారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అగ్రస్థానంలో ఉందన్నారు. దాతలను సముచితంగా సత్కరించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు రాఘవేంద్రశెట్టి, డీవీ సుబ్బరాజు, ఎస్.రమేష్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, మురళీకృష్ణారెడ్డి, గణేష్, చంద్రమౌళి, డాక్టర్ సత్యనాథ్, కృష్ణమూర్తి, శ్రీధర్, ఏకొల్లు రాఘవరెడ్డి, సుబ్బరామిరెడ్డి, గఫార్, నీలాద్రి, ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కల్వర్ట్ పనులకు శంకుస్థాపన

**నెల్లూరు సిటీ:** నగరంలోని 23వ డివిజన్ అనగుంటలో కల్వర్ట్ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు రూ.4.60 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో గత రెండు శతాబ్దాల నుంచి కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆగస్ట్ 8న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యదర్శి బొజ్జా సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలు, బిల్ కలెక్షన్ ఏజెంట్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### వీఆర్ హైస్కూల్లో పేదలకు మాత్రమే సీట్లు

**నెల్లూరు (టౌన్):** వీఆర్ హైస్కూల్‌లో కేవలం నిరుపేద పిల్లలకు మాత్రమే సీట్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పిన వీఆర్ హైస్కూల్‌ను అభివృద్ధి చేయడమే బాధ్యతగా భావించానన్నారు. ఇక్కడ అడ్మిషన్లకు విపరీతమైన డిమాండ్ ఉందని, 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మూడు సెక్షన్లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే యూనిఫామ్‌కు బదులు అదనంగా నారాయణ విద్యాసంస్థల ద్వారా మరో నాలుగు యూనిఫాంలను అందిస్తామన్నారు. దూరప్రాంత విద్యార్థులకు ఉచిత బస్సు, అవసరమైన ఫ్యాకల్టీ, పుస్తకాలు అందిస్తామన్నారు. పీ–4లో భాగంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త డీఎస్సార్ గ్రూపు ఆధ్వర్యంలో రెండు పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మోసపూరిత మాటలను నమ్మొద్దు

**నెల్లూరు (టౌన్):** ఉత్తర భారత దేశం నుంచి వచ్చిన కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు నారాయణ విద్యార్థులు సాధించిన ర్యాంకులు వారివని చెప్పుకుంటున్నాయని, ఆ మోసపూరిత మాటలు నమ్మొద్దని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి తెలిపారు. స్థానిక హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నీట్ 2025 పరీక్షల్లో వెయ్యిలోపు తొమ్మిది ర్యాంకులను నారాయణ విద్యార్థులు సాధించారన్నారు. దీనిపై అబద్ధపు ప్రచారాలు తగవన్నారు.

శాస్త్రోక్తంగా జరుగుతున్న చక్రస్నానం



# ముగిసిన గురువాయూర్ బ్రహ్మోత్సవాలు

**నెల్లూరు(బృందావనం) :** వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలో ఉన్న గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం పరిసమాప్తమయ్యాయి. ముగింపు సందర్భంగా శాస్త్రోక్తంగా మహాకుంభారాధన, నిత్యహోమం, నివేదన, శాత్తుమొర్రై, హయగ్రీవ హోమం, స్వామివారికి నవకలశ స్నపన తిరుమంజనం, చక్రస్నానం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ఆరాధన, పుష్పయాగం జరిపారు. అనంతరం రాత్రి ధ్వజావరోహణ, మహాకుంభ ప్రోక్షణ, ఏకాంతసేవ నిర్వహించారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు నిర్వహించిన పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. ఉభయకర్తలుగా గద్దం రత్నయ్య– సుజాత దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, జి.రత్నయ్య, కె.మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.



పుష్పయాగాన్ని జరిపిస్తున్న అర్చకులు

# మహాసభను జయప్రదం చేయండి

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** ఈనెల 29న జరుగనున్న భవన నిర్మాణ సంఘం నగర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పెంచలయ్య, శ్రీనివాసులు కోరారు. నగరంలోని 15వ డివిజన్ ముత్తుకూరు గేట్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికుల జనరల్‌బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీబైపాస్‌రోడ్డులోని పరమేశ్వరి కల్యాణ మండపంలో మహాసభ జరుగుతుందని, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లి, రాంబాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, సంపూర్ణమ్మ, సుధాకర్‌రావు, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, సుబ్బమ్మ, మహేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు